# సిపిఐ(ఎం)కు ఓటెయ్యండి

## వామపక్షాల్ని బలపర్చండి

# ఉద్యోగి - కార్మిక హక్కుల సాధన కోసం

16వ లోక్‌సభ ఎన్నికల ప్రచార కరపత్రం 2014

ఇంకొద్ది వారాల్లో 16వ లోక్‌సభకు ఎన్నికలు జరగనున్నాయి. నూతన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం కోసం మొత్తం 72 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 48 కోట్లమంది కార్మికులే. గ్రామీణ–పట్టణ ప్రాంతాల్లో వున్న ఆడా–మగ కార్మికులు. మరో 15 కోట్ల మంది యువతరం తొలిసారిగా తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నది.

తాము సాధించిన విజయాల గురించి అధికార పార్టీ ప్రచారం చేసుకోవడం, ప్రతిపక్ష పార్టీలు, పార్టీల కూటములు అధికార పార్టీ వైఫల్యాల గురించి ఎత్తి చూపడం అనేది భారత ప్రజాస్వామ్యంలో ఎన్నికల సందర్భంగా ముందుకొచ్చే ప్రక్రియ.

అయితే ఈ సారి 16వ లోక్‌సభకు జరిగే ఎన్నికలను రెండు పార్టీల మధ్య – ఇద్దరు వ్యక్తుల మధ్యన జరిగే పోరాటంగా మలిచేందుకు విశ్వ ప్రయత్నాలు జరుగుతున్నాయి. కార్పొరేట్ మీడియా ఎన్నికల ప్రక్రియను 'నమో' (నరేంద్ర మోడి)కు రాగా "(రాహుల్ గాంధీ)" కు మధ్యనే పరిమితం చెయ్యడానికి చూస్తుంది. ప్రజల సమస్యలను, ఆకాంక్షలను చర్చకు రానీకుండా చూడడానికి ప్రయత్న పూర్వకంగా జరుగుతున్న కుట్ర ఇది. నయా ఉదారవాద విధానాలు ఆర్థికాభివృద్ధిని పెంచేదానికి దోహదం చేస్తున్నాయని సర్వే సర్వత్రా విశ్వసిస్తున్నారనే భ్రమలు కల్పించి – ఈ విధానాలను పై ఇద్దరిలో ఎవరు మరింత క్రియాశీలంగా ముందుకు తీసుకుపోగలరనే చర్చ చుట్టూ ఈ ఎన్నికలను తిప్పాలని కార్పొరేట్ మీడియా ప్రయత్నిస్తున్నది. విద్య, వైద్యం, సామాజిక భద్రత, ఉపాధి అవకాశాలు, రక్షణ వంటి అంశాలు ప్రజల దైనందిన సమస్యల మీద నయా ఉదారవాద విధానాల ప్రభావాన్ని చర్చకే రాకుండా చూసే దానికి చూస్తుంది. కేవలం వామపక్షాలు మాత్రమే కార్మికుల, రైతుల సాధారణ ప్రజల సమస్యలను ఈ ఎన్నికల ప్రక్రియలో, ప్రచారంలో కేంద్ర బిందువుగా చేసుకొని పనిచేసే దానికి దృఢంగా నిర్ణయించుకున్నాయి. ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్న విధానాలను, ఆ విధానాలను నడిపిస్తున్న రాజకీయాలను ఫోకస్‌లోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాయి.

## నిరుద్యోగం

యు.పి.ఎ.-2 సంకీర్ణ ప్రభుత్వం గొప్పగా సాధించామని చెప్పుకుంటున్న ఆర్థికాభివృద్ధి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఘోరంగా విఫలమైంది. గత ఐదేళ్ళలో సగటున 8.5 శాతం ఆర్థికావృద్ధి రేటు సాధించామని యు.పి.ఎ.-2 సంకీర్ణం ఘనంగా చెప్పుకుంటున్నా ఉపాధి అవకాశాల పెరుగుదల రేటు 0.8 శాతానికి పడిపోయింది.

68వ విడత నేషనల్ సాంపిల్ సర్వే నివేదిక 'యువతరంలో మరీ ముఖ్యంగా విద్యాధిక యువతరంలో నిరుద్యోగిత పెరిగిపోయిందని పేర్కొంది. చండీఘర్‌లో 21 కోర్టు ప్యూను పోస్టులకు 1600 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారన్న ఒక చిన్న వార్త చాలు నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా వుందో అర్థం చేసుకోవడానికి. ఈ పోస్టుకి 6వ తరగతి కనీస విద్యార్హత కావాల్సి వుండగా 40 మంది గ్రాడ్యుయేట్లు కూడా హాజరైనట్లు సమాచారం. అలాగే ఒక మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వీపర్ పోస్టుకు 240 మంది పట్టభద్రులు - (అందులో బి.టెక్ చదివిన వారూ వున్నారు) హాజరయ్యారు. నిరుద్యోగ తీవ్రతకు ఇంతకన్నా పెద్ద ఉదాహరణలు అక్కరలేదు.

2004-05 నుండి 2011-12 మధ్య వున్న ఐదేళ్ళ కాలంలో మహిళా శ్రామికుల సంఖ్య 2 కోట్ల మేరకు తగ్గిపోయింది. అటు గ్రామాల్లో, ఇటు పట్టణాల్లో కలిపి కొద్ది నెలల పాటు భుక్తి గడిపేందుకు తోడ్పడే సీజనల్ పన్నులు టెంపరరీ పనుల సహా అన్ని రకాల వృత్తుల ఉద్యోగాలలో వున్న మహిళల సంఖ్య 14.85 కోట్ల నుండి 12.91 కోట్లకు తగ్గింది. అలాగే వ్యవసాయ పనులకు వెళ్ళేవారి సంఖ్య అదే ఐదేళ్ళ కాలంలో 2.6 కోట్ల మేరకు తగ్గింది. వీళ్ళందరూ పనికి వెరవడం కారణం కాదు... ఆ మాత్రం ఉపాధి కూడా దొరక్కపోవడమే అసలు కారణం.

## పెరుగుతున్న అసంఘటిత రంగం

గత ఐదేళ్ళ కాలంలో కార్మికుల స్థితిగతులు దిగజారిపోయాయి. ఏ మాత్రం ఉద్యోగ భద్రత, ఆదాయ భద్రతలేని కాంట్రాక్టు, క్యాజువల్, టెంపరరీ, డైలీవేజ్, అవుట్ సోర్స్ తదితర కొత్త రూపాల ఉపాధి విస్తరిస్తూ వుంది. అనేక ప్రభుత్వరంగ సంస్థలలోను, ప్రభుత్వ విభాగాలలోనూ పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య కన్నా కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య

హెచ్చుగా వుంది. ఇక ప్రైవేటురంగంలో పరిస్థితి అయితే చెప్పలేనంత ఘోరంగా వుంది. దాదాపు 70 నుండి 80 శాతం మంది ఉద్యోగులు కాంట్రాక్టు కార్మికులే. అదే సంస్థలో పనిచేసే పర్మినెంట్ ఉద్యోగుల జీత భత్యాల్లో సగానికి, పావు వంతుకి కొన్నిచోట్ల అంతకన్నా తక్కువ జీతాలకి పనిచేస్తున్నారు ఈ కాంట్రాక్టు కార్మికులు.

ఉదాహరణకు చూస్తే మారుతి సుజుకి కంపెనీలో 2011 నాటికి 1000 మంది పర్మినెంట్ కార్మికులు వుంటే 800 మంది ట్రైనీలు, 400 మంది అప్రెంటీస్‌లు 1200 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తూ వున్నారు. వీరంతా కార్ల ఉత్పత్తిలో తమవంతు పూర్తి గంటలు పనిచేస్తూ వుంటారు. అంటే మొత్తం 3,400 మంది పనిచేస్తూ వుంటే అందులో 2,400 మంది (70.59 శాతం నాన్-పర్మినెంట్ కార్మికులు కాగా పర్మినెంట్ కార్మికులు 1000 మంది (29.41 శాతం) మాత్రమే. పర్మినెంట్ ఉద్యోగులకు 13000-17000 వరకు నెలసరి జీతంగా లభిస్తుంటే ట్రైనీలకు 8000 రూపాయలు, కాంట్రాక్ట్ కార్మికులకు 6,500 రూపాయలు అప్రెంటిస్‌లకు నెలకు రూ. 400 రూపాయల జీతం మాత్రమే ముడుతుంది. ఈ రకంగా మారుతి సుజుకి కంపెనీ పర్మినెంట్‌యేతర కార్మికుల పొట్టగొట్టి సూపర్ లాభాలు పోగేసుకుంటుంది.

ప్రభుత్వరంగ పరిశ్రమలలోని కాంట్రాక్టు కార్మికుల స్థితిగతులు కూడా ఏమంత మెరుగ్గా లేవు. భిలాయ్, రూర్కేలా ఉక్కు కర్మాగారాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు నెలకు 5000 రూపాయలు మాత్రమే పొందుతున్నారు. అదే పనిలో వున్న పర్మినెంట్ కార్మికులకు నెలకు రూ. 30,000లు వరకు జీతం వస్తుంది. మహారాష్ట్రలోని బి.ఎస్.ఎన్.ఎల్. కాంట్రాక్టు కార్మికులకు చెల్లించే నెలసరి వేతనం ఎంతో తెలుసా? కేవలం 1500 రూపాయలు. ఇది ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనంలో సగం కన్నా తక్కువ.

లక్షలాదిమంది దళితులు, గిరిజనులు ఒడిషా, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలోని ఐరన్ ఓర్ గనులలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తూ వున్నారు. ఐరన్ ఓర్‌ను సేకరించే దానికి యంత్రాల వినియోగం పెరిగినా ఈ కార్మికులు గనులలోకి దిగి పెద్దపెద్ద పెళ్ళలను పగలకొట్టే పని చేస్తూ వుంటారు. ఇట్లా గనులనుండి తవ్వి తీసిన ఇనుప ఖనిజం ఉత్పత్తి ధర టన్నుకు రూ. 300లు మించదు. కాని కంపెనీలు టన్నుకు రూ. 600 రూపాయలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాయి. కార్మికుల కష్టంతో పోగేసిన లాభాలను కార్పొరేట్ కంపెనీలు దిగమింగుతున్నాయి. 43వ 'ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్' కాంట్రాక్టు కార్మికులకు కూడా పర్మినెంట్ కార్మికులతో సమానంగా - సమానపనికి సమాన వేతన

న్యాయం అందేలా' కాంట్రాక్ట్ లేబర్ చట్టానికి సవరణ చెయ్యాలని సిఫార్సు చేసింది. కాని యు.పి.ఎ.-2 ప్రభుత్వం ఈ సిఫార్సును అమలు చేసేందుకు ఏమాత్రం మొగ్గు చూపలేదు.

## పెరుగుతున్న లాభాలు - దిగజారుతున్న వేతనాలు

## వేతనాల వాటా 10 శాతం, లాభాలవాటా 90 శాతం

పర్మినెంట్ స్వభావం గల పనిలో కూడా పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు, క్యాజువల్, టెంపరరీ, అప్రెంటిస్, ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కార్మికులను వినియోగించుకోవడం ద్వారా యాజమాన్యాలు జీతభత్యాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకొని లాభాలను అనూహ్యంగా పెంచుకుంటున్నాయి.

ఫ్యాక్టరీల రంగంలో 1981-82 నాటికి వాటి నికర విలువలో కార్మికుల జీతభత్యాలు 30.28 శాతంగా వుండేవి. అవి 1992-93 నాటికి 19.90 శాతానికి, 2007-08 నాటికి 10.60 శాతానికి దిగజారిపోయాయి. ఆ రకంగా నికర విలువ పెరుగుదలలో 90 శాతాన్ని లాభాల రూపంలో యజమానులు ఎగరేసుకుపోయారు. 1990-2001 మధ్యకాలంలో సంఘటితరంగంలో వున్న కార్మికుల నిజవేతనం 108.41 రూపాయలుగా వుంటే 2010-11 నాటికి అది 103.76 రూపాయలకు దిగజారిపోయింది.

ఈ రకంగా పోగేసుకున్న లాభాలన్నీ అతి కొద్ది కార్పొరేట్ అధిపతుల చేతుల్లో చిక్కుకుపోయాయి. 2005-06 నాటి గణాంకాలు పరిశీలిస్తే 301, 736 కంపెనీల నుండి అందులో 113 శాంపిల్ కంపెనీలు ఏడాదికి 500 కోట్ల రూపాయల పైచిలుకు లాభాలు గడించాయి. అంటే కేవలం 0.04 శాతం కంపెనీలు 49.87 శాతం లాభాలు పోగేసుకున్నాయి. అదే 2010-11 నాటి గణాంకాలు పరిశీలిస్తే కేవలం 0.05 శాతం కంపెనీలు 57.92 శాతం లాభాలను పోగేసుకున్నట్లు స్పష్టమౌతుంది. మన దేశంలో ఒక్కో కార్పొరేట్ కంపెనీ అనేక వ్యాపారాలు నడుపుతున్న వాస్తవాన్ని గమనంలోకి తీసుకుంటే కేవలం 10 కార్పొరేట్ కంపెనీలే 60 శాతం లాభాల్ని హస్తగతం చేసుకున్నట్లు తేటతెల్లమౌతుంది. యు.పి.ఎ.-2 ప్రభుత్వ హయాంలో అతి కొద్దిమంది చేతుల్లో సంపద కేంద్రీకరణ జరిగిన తీరును ఇది వెల్లడిస్తుంది.

## ప్రభుత్వ పథకాలు

దేశ పౌరులకు సంబంధించిన విద్య, వైద్యం, శిశు సంరక్షణ, పౌష్టికాహారం తదితర ప్రాథమిక మౌళిక అవసరాలకు సంబంధించి బహుశా ప్రపంచంలోనే మన దేశం ఒక్కటే వాటిని ప్రజల అవిభాజ్య హక్కులుగా కాక సర్కారు సంక్షేమ పథకాలుగా కొనసాగిస్తున్నది.

సమీకృత శిశు అభివృద్ధి పథకం (ఐ.సి.డి.ఎస్.) జాతీయ గ్రామీణ వైద్య పథకం (ఎన్.ఆర్.హెచ్.ఎ.ం), మధ్యాహ్న భోజన పథకం, సర్వశిక్షా అభియాన్, జాతీయ బాల కార్మిక ప్రాజెక్టు ఇత్యాది అనేక పథకాలను అత్యంత ఆర్భాటంగా 'ఫ్లాగ్‌షిప్ పథకం, ఏకైక పథకం పేరిట గొప్పగా ప్రకటించింది. ఈ పథకాల అమలుకు దాదాపు కోటిమంది ఎక్కువలో ఎక్కువగా మహిళలు పనిచేస్తూ వున్నారు. వీళ్ళందరికీ కనీస వేతనాలు చెల్లించకుండా ఎగవేసేదానికి ప్రభుత్వం ఒక కిటుకు ఉపయోగించింది. వివిధ పథకాలలో పనిచేసేవారికి 'ఆషా'లు, 'ఉషా'లు 'యశోద'లు, 'మమత'లు, సామాజిక కార్యకర్తలు వంటి వివిధ పేర్లు పెట్టి వీళ్ళంతా చట్టప్రకారం 'కార్మిక నిర్వచనం కిందకు రారు కాబట్టి కనీస వేతనాలు ఇవ్వనక్కరలేదని లాజిక్కుతీసి 'గౌరవ' వేతనాలతో సరిపెట్టుకోమంటుంది. ఈ 'గౌరవ' వేతనం వెయ్యి రూపాయలనుండి నాలుగువేల రూపాయలదాకా మాత్రమే వుంటుంది. 'ఆషా'లు 'ఉషా'లకు 'పీస్‌రేట్ ఇన్సెంటివ్' పేరిట చెల్లించేది నెలకు వెయ్యి రూపాయలు కూడా కాదు.

45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ఈ 'స్కీమ్ వర్కర్ అందరినీ కార్మికులుగా పరిగణించి అందరికీ కనీస వేతనం చెల్లించాలని, పెన్షన్–గ్రాట్యుటీ తదాది సామాజిక భద్రతా సదుపాయాలు కల్పించాలని సిఫార్సు చేసింది. యు.పి.ఎ–2 ప్రభుత్వం ఈ సిఫార్సునూ బుట్టదాఖలా చేసింది. 'మహిళా సాధికారత' అంశం మీద నియమించబడిన పార్లమెంటరీ కమిటీ కూడా అంగన్‌వాడీ కార్మికులు, హెల్పర్లకు కనీస వేతనం అమలు చెయ్యడంతో పాటు ఈ జీతాలను ధరల సూచీతో అనుసంధానం చెయ్యాలని సిఫార్సు చేసింది. యు.పి.ఎ–2 ప్రభుత్వం ఈ సిఫార్సునూ పెడచెవిన పెట్టింది.

లక్షలాదిమంది స్కీమ్ వర్కర్ల పనికి తగ్గ ప్రతిఫలం చెల్లించకుండా ప్రభుత్వం వారి శ్రమను దోచుకుంటుంది. ఇది చాలనట్లు వాళ్ళ ఉద్యోగ విధులతో సంబంధం లేని అనేకానేక పనులకు జనగణన, సర్వేలు వృద్ధాప్య పెన్షన్ల చెల్లింపు తదితర పనులు –

గ్రామస్థాయిలో వీరి సేవలనే ఉపయోగించుకుంటుంది ప్రభుత్వం. నిజానికి ఈ పనులన్నీ చక్కబెట్టే దానికి ఇంకొన్ని లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. కాణీ ఖర్చు లేకుండా ఆ పనులన్నీ స్కీమ్ వర్కర్ల మీద రుద్దు తున్నారు. కాకులను కొట్టి గద్దలకు వేసిన చందంగా లక్షలాదిమంది కార్మికులకు పనికితగ్గ వేతనాలు చెల్లించకుండా మిగిల్చిన సొమ్మును బహుళజాతి కార్పొరేట్ కంపెనీలకు పలు రాయితీల రూపంతో కట్టబెడుతుంది యు.పి.ఎ.–2 ప్రభుత్వం.

## కార్మికులమీద పెరుగుతున్న దాడులు

యు.పి.ఎ.–2 ప్రభుత్వం కార్మిక చట్టాల్లో యాజమాన్యాలకు అనుగుణంగా అనేక మార్పులు తీసుకురావాలని తలపోసింది కాని ఐక్య కార్మికోద్యమ ప్రతిఘటన మూలంగా తాను అనుకున్న మార్పులన్నీ చేపట్టలేకపోయింది. అయినప్పటికీ ఇవాళ ప్రైవేటు రంగ పరిశ్రమలలో యధేచ్ఛగా కార్మిక చట్టాల ఉల్లంఘన జరుగుతూ వుంది. దేశవ్యాప్తంగా చట్టాలను తుంగలో తొక్కి కార్మికులతో ఎలాంటి ఓవర్ టైం అలవెన్స్ చెల్లించకుండా – 10 నుండి 12 గంటల పాటు పనిచేస్తున్నారు తమ హక్కులు కాపాడుకునే దానికి సంఘటితపడడానికి కార్మికులు ఏమాత్రం ప్రయత్నించినా యాజమాన్యాలు సహించలేని తీవ్ర ధోరణి ఈ కాలంలో పెరిగిపోయింది. కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు, ఉమ్మడి బేరసారాల హక్కును కల్పించాలన్న అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐ.ఎల్.ఓ.) అధికరణ 87 మరియు 98లను భారత సర్కారు ఈ రోజు వరకు చట్టపరంగా ఆమోదించలేదు.

మానేసర్‌లోని మారుతి సుజుకీ కార్లప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులు సంఘం పెట్టుకునే హక్కుకోసం సమరశీల పోరాటం చేశారు. యాజమాన్యం అందుకు ససేమిరా ఒప్పుకోలేదు. హర్యానాలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కంపెనీకి కొమ్ముకాసి కార్మికులను బలప్రయోగంతో తీవ్రంగా అణిచివేసింది. ఈ రోజుకీ తప్పుడు అభియోగాల మీద 150 మంది కార్మికులు జైళ్ళలో మగ్గుతున్నారు. కోర్టులు వారికి బెయిల్ ఇవ్వడానికి కూడా నిరాకరిస్తున్నాయి.

ఇదేదో ఒక్క రాష్ట్రానికే పరిమితమైన ధోరణి కాదు. కార్మికులపై తప్పుడు కేసులు పెట్టడం, జైళ్ళలో వేయించడం, భౌతిక దాడులకు తెగబడడం, హత్యాయత్నాలకు పూనుకోవడం, పని ప్రదేశంలో కక్ష సాధింపుకు దిగడం దేశవ్యాప్తంగా జాడ్యంలా

అలుముపోయింది. ఆంధ్రప్రదేశ్‌లోని రెడ్డిల్యాబ్స్‌లో, తమిళనాడులోని హుండాయ్, ఫ్యాక్స్‌కాన్ కంపెనీలలో, మహారాష్ట్రలోని నాసిక్ పారిశ్రామిక వాడలో, హిమాచల్‌ప్రదేశ్‌లోని హైడ్రోపవర్ ప్రాజెక్టులలో చోటు చేసుకున్న పరిణామాలు ఇందుకు ఉదాహరణ.

కనీస వేతనాలు చెల్లించకపోవడం, చట్టపరమైన ఇతరత్రా సదుపాయాలు, సమానపనికి సమాన వేతనాలు, ప్రసూతి సదుపాయాల వంటివి నిరాకరించడం యాజమాన్యాలకు పరిపాటిగా మారింది. వీటన్నింటినీ పర్యవేక్షించాల్సిన కార్మికశాఖ (లేబర్ డిపార్ట్‌మెంట్)తో యాజమాన్యాలు కుమ్మక్కు పెరిగిపోయింది. ఒకప్రక్కన నిత్యం పెరిగిపోతున్న నిత్యావసరాల ధరవరలు – ముఖ్యంగా ఆహార సరుకుల ధరలు మరీ మండిపోవడం, పెరగని జీతాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, పని పరిస్థితులు నానాటికీ దిగజారిపోవడం ఇవన్నీ కార్మికులలో తీవ్ర అసంతృప్తికి, ఆవేశానికి దారితీస్తున్నాయి. 2009 నుండి ఐక్య కార్మికోద్యమం నిర్వహించిన దేశవ్యాపిత సమ్మెలలో సమ్మె సమ్మెకూ కార్మికుల ప్రత్యక్ష భాగస్వామ్యం గణనీయంగా పెరగడమే ఇందుకు ఉదాహరణ.

కాంగ్రెస్ నేతృత్వంలోని యు.పి.ఎ-2 సర్కారు మీద కార్మికులు, ఉద్యోగులు, సగటు ప్రజానీకంలో ఉన్న అసంతృప్తియే ఆ పార్టీ వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో ఘోర పరాజయాలు మూట కట్టుకోవడానికి కారణంగా నిలిచింది. దీంతో రాబోయే పార్లమెంటు ఎన్నికలలో అధికారంలోకి రాబోయేది మేమే అన్న భ్రమలు భారతీయ జనతాపార్టీ (బిజెపి)లో పెరిగిపోయాయి. ఆర్ఎస్ఎస్ అండదండలతో బిజెపి నరేంద్రమోడీని తన ప్రధాని అభ్యర్థిగా ప్రకటించింది. ఆర్ఎస్ఎస్ ఈ పాటికే తన అనుబంధ సంస్థల ద్వారా దేశంలోని వివిధ కేంద్రాలలో మత ఘర్షణలు రెచ్చగొట్టి ప్రజలలో మతాలవారీగా చీలికలు తెచ్చి అలాంటి భావోద్వేగ నేపథ్యంలో బి.జె.పి.కు ఎన్నికల లబ్ధి చేకూర్చాలని ప్రయత్నిస్తుంది. దేశంలోని బడా కార్పొరేట్ కంపెనీలన్నీ నరేంద్రమోడీకి దన్నుగా నిలిచాయి. నరేంద్రమోడిలో వున్న నియంతృత్వ ధోరణులను అడ్డం పెట్టుకొని నయా ఉదారవాద సంస్కరణల పట్ల వ్యతిరేకతను అణగదొక్కేసి కార్పొరేట్ సంస్థలు మరిన్ని లాభాలు, సంపద, పోగేసుకోవడం, తద్వారా రాజ్యం మీద పట్టు సాధించాలన్న ప్రణాళికతో వున్నాయి.

## 'గుజరాత్ నమూనా' భ్రమలు

మోడీ పట్ల బిజెపి పట్ల ప్రజాకర్షణ కల్గించడంలో భాగంగానే కార్పొరేట్ కంపెనీల అజమాయిషీ ఉన్న మీడియా గుజరాత్ తరహా పాలన, గుజరాత్ తరహా అభివృద్ధిల

గురించి ప్రచార పటాటోపం ప్రదర్శిస్తూ వుంది. 2002లో గుజరాత్‌లో ఇదే నరేంద్ర మోడీ హయాంలో జరిగిన దారుణ మానవ మారణకాండలో వేలాదిమంది ముస్లింలు హతమార్చబడడం, వందలాది ముస్లిం మహిళలు బలాత్కారానికి గురికావడంలో వైఫల్యం ఏ స్థాయిలో వుందో తెలిసీ ఇవాళ కార్పొరేట్ వర్గాలు తమ స్వీయ ప్రయోజనాలను ముందుకు తీసుకుపోయే మొనగాడుగా నరేంద్రమోడీని చూస్తున్నాయి.

గుజరాత్ తరహా అభివృద్ధి వివరాల్లోకి వెళ్ళడానికి ముందు ఈ మధ్యనే మోడీ 'ఆర్థిక దార్శనికత' పేరిట విడుదలైన ఒక పుస్తకం గురించి చెప్పుకోవాలి మనం. 'మోడినామిక్స్' - 'ఇంక్యూజివ్ ఎకనామిక్స్, ఇంక్లూజివ్ గవర్నెస్' పేరిట అచ్చయిన ఈ పుస్తకాన్ని రాజ్యసభలో బి.జె.పి.పార్లమెంటరీ నేత అరుణ్‌జైట్లీ ఆవిష్కరించారు. బి.జె.పి. ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్ర మోడి అధికారిక 'ఆర్థిక దార్శనికత'గా చెప్పుకొచ్చిన ఈ పుస్తకంలో ఏమని రాసి వుందో చూడండి–

"మోడి ఆర్థిక రీతి కూడా చిదంబరం ఆర్థిక నీతి వంటిదే" ఉదారవాద సంస్కరణలను బలంగా విశ్వసిస్తుంది. ఇరువురి అభిప్రాయాలు వేర్వేరు కావచ్చు కానీ ఆర్థిక నీతి మాత్రం ఒక్కటే. ఆర్థికరంగం పట్ల, పరిపాలన పట్ల ఇద్దరి వ్యాపారాత్మక ధోరణియే". ఇంక గుజరాత్‌లో నరేంద్రమోడి పరిపాలన యు.పి.ఎ-2 కన్నా భిన్నంగా లేదన్న తిరుగులేని వాస్తవాన్ని ఎవరన్నా కాదనగలరా!

దేశంలో ఉదారవాద విధానాల జోరు అందుకున్న నేపధ్యంలో గుజరాత్ రాష్ట్రం అత్యంత వేగంగా అభివృద్ధి అయిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. అయితే ఆ ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించడానికి వ్యాపార వర్గాలకు ఆకట్టుకోవడానికి తగిన వాతావరణం సృష్టించడంలో పెట్టిన శ్రద్ధ ఆ రాష్ట్ర ప్రజానీకం ముఖ్యంగా కార్మికులు కష్టజీవుల, జీవన ప్రమాణాలు మెరుగుపడడంలో పెట్టనే లేదు.

ఇప్పటిదాకా గుజరాత్ అభివృద్ధి గురించి సాగిన ఊదరగొట్టు ప్రచారాన్ని ఈ మధ్యనే రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ అధ్యక్షతన నియమించిన 'రాష్ట్రాల సమీకృత అభివృద్ధి సూచి నిర్ధారణ కమిటీ' వెలువరించిన నివేదిక పటాపంచలు చేసింది. 0.4 నుండి 0.6 శాతం స్కోరు వచ్చిన రాష్ట్రాలను అభివృద్ధి చెందిన రాష్ట్రాలుగానూ, 0.4 కన్నా తక్కువ స్కోరు వచ్చిన రాష్ట్రాలను సాపేక్షంగా అభివృద్ధి రాష్ట్రాలుగానూ ఆ కమిటీ వర్గీకరించింది. గుజరాత్ రాష్ట్రం 0.49 స్కోరుతో తక్కువ అభివృద్ధి సాధించిన రాష్ట్రాల క్యాటగిరీలోకి వచ్చింది. మొత్తం అభివృద్ధి చెందిన రాష్ట్రాల వరుసలో గుజరాత్‌ది 12వ స్థానం.

## కార్పొరేట్ అనుకూల నమూనా

గుజరాత్‌లో జరిగిన అభివృద్ధి మూలంగా లబ్దిపొందినది ఎవరయ్యా అంటే కార్పొరేట్ కంపెనీలు, నయా ధనిక వర్గమే తప్ప ఆ రాష్ట్ర ప్రజానీకంగానీ, కార్మికవర్గంగానీ కాదు.

అందుకే చిన్న చిన్న వ్యాపారస్తులను, వీధుల్లోని చిరు అమ్మకందార్లను, సామాన్య ప్రజానీకాన్ని ఆకట్టుకోవడానికి నరేంద్ర మోడి తనని తాను 'చాయ్‌వాలా'గా ప్రచారం చేసుకోవడం మొదలుపెట్టాడు. వాస్తవానికి మోడి ప్రభుత్వం చిన్న చిన్న వ్యాపారస్తులకు గాని, చిన్న పరిశ్రమాధిపతులకు గాని ఒరగబెట్టిందేం లేదు. మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో 40 శాతం మొత్తాన్ని బడా కార్పొరేట్ కంపెనీలకు, మౌలిక వసతుల కల్పన కంపెనీలకు సబ్సిడీలు, రాయితీల రూపంలో కట్టబెట్టింది. మోడీ ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి ఇచ్చిన రాయితీల్లో చిన్న పరిశ్రమలకు దక్కింది కేవలం 2.3 శాతం మాత్రమే.

బడా పరిశ్రమలకు భూమిని కారుచౌక రేట్లకు కట్టబెట్టింది. 'అదానీ గ్రూప్' కంపెనీకి 54.65 హెక్టార్లు భూమి లేదా 54.6 చదరపు కిలోమీటర్ల భూమిని హెక్టారుకు 10,000 రూపాయల చొప్పున 60 కోట్లకు ధారాదత్తం చేసినట్టు ఆ రాష్ట్ర రెవెన్యూ మంత్రియే అసెంబ్లీలో ప్రకటించాడు. ఈ భూమి మార్కెట్ రేటు మోడి ప్రభుత్వం కట్టబెట్టిన రేటుకన్నా 8,000 రెట్లు ఎక్కువగా వుండింది.

## కార్మికుల స్థితిగతులు

గుజరాత్‌లో 2003-04, 2008-09 మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలలోని ఉద్యోగుల సంఖ్య 8.24 లక్షలనుండి 7.98 లక్షలకు పడిపోయింది. ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రించడానికి రిక్రూట్‌మెంట్ మీద నిషేధం విధించి కొనసాగిస్తున్న మూలాన చోటు చేసుకున్న పరిణామం ఇది. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి 2000 నుండి 2008 మధ్యకాలంలో 8 శాతంగా నమోదయింది కానీ సంఘటితరంగంలో ఉపాధి కల్పన 1.6 శాతం నామమాత్రపు రేటున మాత్రమే జరిగింది.

2007-08 ఆర్థిక సంవత్సరంలో స్థిర పెట్టుబడిని ఎక్కువగా ఆకర్షించిన మొత్తం 20 రాష్ట్రాల్లో గుజరాత్ నెంబర్‌వన్ పొజిషన్‌లో వుంది. ఇన్వెస్ట్‌మెంట్ పెట్టుబడులను ఆకర్షించడంలో రెండవ స్థానంలో, ఫ్యాక్టరీల సంఖ్యలో నాల్గవ స్థానంలో వుంది. కానీ అదే 20 రాష్ట్రాల వరుసలో లేబర్ పెట్టుబడి నిష్పత్తిలో మాత్రం కడమ నుండి మూడవస్థానంలో అంటే 18వ స్థానంలో వుంది.

రాష్ట్రంలో ఒక్కో ఫ్యాక్టరీమీద పెట్టిన పెట్టుబడి 1998-99 నాటికి రూ. 566.93 పైసలు కాగా 2007-08 నాటికి ఇది రూ. 1387.16 పైసలకు పెరిగింది. కానీ ఇదే కాలంలో వేతనాల శాతం 11.28 శాతం నుండి 8.5 శాతానికి అంటే 3.25 శాతం తగ్గింది. అంటే ఒక్కో ఫ్యాక్టరీ సృష్టించే సంపదలో 92 శాతం యజమానులు తమ జేబులో వేసుకుంటుంటే కార్మికులకు జీతభత్యాల రూపంలో కేవలం 8.5 శాతం దక్కుతున్నది. సంపద సృష్టిలో జీతాల నిష్పత్తి లెక్కన చూస్తే 20 రాష్ట్రాల్లో గుజరాత్‌ది 15వ స్థానం. కేరళ 22.47 శాతంతో ప్రాథమికస్థానంలోను, బెంగాల్ 21.89 శాతంతో ద్వితీయ స్థానంలోను వున్నాయి.

దేశవ్యాప్తంగా అసంఘటితరంగంలో మహిళా కార్మికులు ఎక్కువ శాతంగా వున్నారు. గుజరాత్‌లో ఇది ఇంకా ఎక్కువ. దేశవ్యాప్తంగా అసంఘటితరంగంలో పనిచేస్తున్న వారిలో మహిళలు 95.93 శాతం కాగా గుజరాత్‌లో 97.59 శాతంగా వున్నారు. దేశవ్యాప్తంగా సంఘటిత రంగంలో మహిళల శాతం 4.7 కాగా గుజరాత్‌లో ఇది కేవలం 2.4 శాతంగా వుంది. అదే కేరళ విషయానికి వస్తే సంఘటితరంగంలో మహిళలు 19 శాతం కాగా అసంఘటితరంగంలో 81 శాతంగా వున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న 20 రాష్ట్రాల్లో ఈ సూచికి సంబంధించిన గుజరాత్ 11వ స్థానంలో వుంది.

కేంద్రంలో అధికారంలో వున్న కాంగ్రెస్ సంకీర్ణ సర్కారు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల మూలంగా దేశవ్యాప్తంగానే కార్మికులకు తమ హక్కులు, సదుపాయాలు నిరాకరించబడుతున్నాయనీ, ఉత్పాదకత పెరిగినా కార్మికుల ప్రయోజనాలను వారికి అందించడంలో ఘోర వైఫల్యం చోటు చేసుకుంటుందని ఇంతకుముందే చెప్పుకున్నాం. ఇక గుజరాత్‌లో వారి పరిస్థితులైతే మరింత ఘోరం. 2007-08 నాటి గణాంకాల ప్రకారం దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీ, పురుష క్యాజువల్ కార్మికుల దినసరి భత్యం వరుసగా రూ. 62.26 పైసలు, రూ. 75.30 పైసలు కాగా గుజరాత్‌లో ఈ దినసరి భత్యాలు రూ. 58.97 పైసలు, రూ. 68.53 పైసలు వున్నాయి. వ్యవసాయరంగంలో గుజరాత్ అద్భుతాలు సాధించిందని చెప్పుకుంటున్న ఆ కాలంలో క్యాజువల్ కార్మికుల దినసరి భత్యం విషయంలో మగవారికి సంబంధించి 14వ స్థానంలో ఆడవారికి సంబంధించి 8వ స్థానంలో వుంది.

## కార్మిక చట్టాల అమలు

రిక్రూట్‌మెంట్‌పై గుజరాత్ ప్రభుత్వం కొనసాగిస్తున్న నిషేధం మూలంగా కార్మికశాఖ యావత్తూ నిర్వీర్యమైపోయింది. ఐ.ఎల్.ఓ. ప్రమాణాల ప్రకారం గుజరాత్‌లో

ఉన్న ఫ్యాక్టరీల సంఖ్యకుగాను 232 మంది కార్మికశాఖ అధికారులు వుండాలి. కానీ మోడీ ప్రభుత్వం కేవలం 154 పోస్టులు శాంక్షన్ చేసింది. అందులోనూ 46 పోస్టులు ఖాళీగా పడి వున్నాయి. 2010నాటి తాజా పరిస్థితి ఇది. మరోప్రక్కన గుజరాత్‌లో ఫ్యాక్టరీల సంఖ్య పెరుగుతూ వున్నా కేవలం 46 శాతం కార్మికశాఖ అధికారులతో వీటి పర్యవేక్షణ ఒక ఫార్సుగా తయారైంది. ఇది చాలదన్నట్లు అసంఘటితరంగ పరిధిని మరింత విస్తృతం చేసింది మోడీ ప్రభుత్వం. గుజరాత్‌లోని అతి పెద్ద పారిశ్రామికవాడ అయిన సూరత్‌లోనే పరిశ్రమల భద్రత ఆరోగ్యాలను పర్యవేక్షించాల్సిన అసిస్టెంట్ డైరెక్టర్లు 50 మంది కన్నా ఎక్కువ కావాల్సి వుండగా సర్కారు భర్తీ చేసిన పోస్టులు కేవలం 6 మాత్రమే. ఈ వివరాలను బట్టే గుజరాత్‌లో మోడి ప్రభుత్వం కార్మిక చట్టాల అమలులో ఎంత దిగనాసితనంగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు.

## బాల కార్మికులు

నేషనల్ శాంపిల్ సర్వే 2014 జనవరిలో విడుదల చేసిన నివేదికను పరిశీలిస్తే గుజరాత్ గ్రామీణ–పట్టణ ప్రాంతాలు రెండింటా బాల కార్మికులు దేశంలో కల్లా అత్యధికంగా వున్నారని స్పష్టమౌతుంది. గుజరాత్ గ్రామీణ ప్రాంతాల్లో 5–14 ఏళ్ళ మధ్య వయసుగల బాల కార్మికులు 4.3 శాతంగా వున్నారు. జార్ఖండ్ మినహా మిగతా అన్ని రాష్ట్రాలకన్న గుజరాత్‌లో బాల కార్మికులు అత్యధిక సంఖ్యలో వున్నారు. రాజ్యసభలో లేవనెత్తిన ఒక ప్రశ్నకు సమాధానంలో గుజరాత్‌లో 2009–10 నాటికి 390,687 మంది నమోదైన బాల కార్మికులు వున్నట్లు వెల్లడైంది. వీరంతా బిటి ప్రత్తి సాగు, చెరకు తోటలు, ఉప్పుమడులు, అగర్‌బత్తీ తయారీ, బీడీ తయారీ, దుస్తుల పరిశ్రమ, చేపల వేట, చెత్త ఏరివేత రంగాలలో పనిచేస్తూ వున్నారు.

## మానవాభివృద్ధి

దారిద్ర్య నిర్మూలన అంశంలో గుజరాత్ మొత్తం 20 రాష్ట్రాల పరిశీలనలో 11వ స్థానంలో ఉందని ప్రణాళికా సంఘం లెక్క తేల్చింది. గత దశాబ్దకాలంలో గుజరాత్ గిరిజనులలో పేదరికం పెరిగిపోయినట్లు విశదమౌతుంది. 2012 నాటికి నవ జాత శిశు మరణాల రేటు గుజరాత్‌లో ప్రతి వెయ్యిమందికి 38 కాగా కేరళలో ఇది అత్యల్పంగా 12, తమిళనాడులో 21, మహారాష్ట్రలో, 21, పంజాబ్‌లో 28గా వుంది. భారతదేశంలో నవజాత శిశు మరణాలకు సంబంధించి ప్రముఖ అంతర్జాతీయ వైద్య పత్రిక 'లాన్సెట్'

2011-12 మధ్యకాలం నాటి వివరాలను ప్రచురించింది. 2012 నాటికి గుజరాత్‌లో 5 ఏండ్లలోపు శిశు మరణాల రేటు ప్రతి వెయ్యిమందికి 52.2 మందిగా అత్యధిక స్థాయిలో వుందని హర్యానాలో 49.5, ఆంధ్రప్రదేశ్‌లో 47.2, జమ్మూకాశ్మీర్‌లో 44.1, కర్ణాటకలో 42.6, హిమాచలప్రదేశ్‌లో 42.5, పంజాబ్‌లో 39.9, బెంగాల్‌లో 39.6, మహారాష్ట్రలో 32.6, తమిళనాడులో 27.3, కేరళలో 13.2గా వుంది. గుజరాత్‌లో సగంమంది పిల్లలు పౌష్టికాహార లేమితో బరువు తక్కువగా వున్నారని, 55.3 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని వివరించింది. మానవాభివృద్ధి ప్రమాణాలలో గుజరాత్ ఇంతగా వెనుకబడిన నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్‌లో ప్రజారోగ్యానికి కేటాయింపులో 15 ఏండ్ల క్రితం 4.5 శాతం కాగా ఇవాళ కేటాయింపులు 0.77 శాతానికి దిగజారిపోయాయి.

గుజరాత్ తరహా అభివృద్ధి ఆ రాష్ట్రంలోని లక్షలాదిమంది దళితుల జీవితాలలో ఏమాత్రం వెలుగునింపలేకపోయింది. ఈ రోజుకీ ఆ రాష్ట్రంలో వేలాదిమంది దళితులు పాకీ పనిలో మగ్గిపోతున్నారు. మలమూత్రాలను చేత్తో ఎత్తేసే పనిలో 64,000 మంది వున్నారని ఆరాష్ట్ర ప్రభుత్వమే (2007 నాటికి) చెబుతున్నది. ఈ సమస్య నిర్మూలన కోసం పనిచేస్తున్న ఒక ప్రభుత్వేతర సంస్థ (యన్జీవో ఆర్గనైజేషన్) ఒక అహమ్మదాబాద్ మున్సిపాలిటీలోనే మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 126 ప్రాంతాల్లో ఈపనికి దళితులను వినియోగిస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చెప్పే అంకెల కన్నా ఎక్కువ మందే ఈ అమానవీయ వృత్తిలో వున్నారని వెల్లడించింది.

## కాంగ్రెస్-బిజెపిలు

## ఒక నాణేనికి రెండు మొహాలు

నయా ఉదారవాద విధానాల అమలులో గానీ, వాణిజ్య వ్యాపార కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చెయ్యడంలో గానీ కాంగ్రెస్‌కు బిజెపికి రాహుల్‌గాంధీకి నరేంద్రమోడీకి అట్టే తేడా లేదు. ఎన్నికలకు సన్నాహకంగా వీరిద్దరూ ముందుగా దేశంలోని కార్పొరేట్ వ్యాపారవర్గ ప్రతినిధులతో సమావేశాలు వేసి వారి ప్రయోజనాలను కాపాడతాం అని పూర్తి హామీ ఇచ్చాకే దేశం మీద పడ్డారన్న సంగతి ప్రతి ఒక్కరూ గుర్తు తెచ్చుకోవాలి.

కార్మికులమీద, జనసామాన్యంమీద అలవిమాలిన భారాలు మోపుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల మీద జాతీయ స్థాయిలోగానీ, రాష్ట్రాలస్థాయిలోగానీ ఈ రెండు పార్టీల మధ్యగానీ ఈ ఇరువురు వ్యక్తుల మధ్యగానీ అణువంత భేదాభిప్రాయం వున్నట్లు మీకు ప్రకటన మాత్రంగానైనా ఎక్కడా కనబడదు.

## ప్రత్యామ్నాయమేమిటి?

మనదేశంలోగానీ, ప్రపంచవ్యాప్తంగా నయా ఉదారవాద విధానాలు, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలను తలకెత్తుకున్న ఏ దేశంగానీ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచలేకపోయిన అనుభవం మన కళ్ళముందు కనబడుతుంది. అందుకే కార్మికుల, సామాన్య ప్రజల కష్టాలు, కడగండ్లు తొలగాలంటే ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల అవసరం ఎంతైనా వుంది.

కార్మికవర్గ ప్రయోజనాలు కాపాడడంలోగానీ, వారి పోరాటాలకు అండగా నిలవడంలోగానీ ఇటు క్షేత్రస్థాయిలో అటు పార్లమెంటరీ రంగంలో కేవలం సి.పి.ఎం., ఇతర వామపక్షాలు మాత్రమే నికరంగా నిలబడ్డాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు ప్రత్యామ్నాయంగా ప్రజానుకూల, కార్మికవర్గ అనుకూల విధానాలను చర్చకు పెట్టాయి.

నిన్న మొన్నటి దాకా వామపక్ష, వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వాలు అధికారంలో వున్న బెంగాల్, కేరళ రాష్ట్రాలలోగానీ, నేడు త్రిపురలో అధికారంలో వున్న వామపక్ష ప్రభుత్వంగానీ, కార్మికుల పోరాటాలను అణిచివేయడంగానీ అందుకు పోలీసు బలాన్ని ఉపయోగించడంగానీ ఎన్నడూ చేయలేదు. కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు, ఉమ్మడి బేరసారాల హక్కు సమ్మె హక్కు సహా చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణకు కట్టుబడి వున్నాయి. నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం చేసిన పోరాటాలన్నింటా ఈ ప్రభుత్వాలు వాటికి మద్దతుగా నిలిచాయి. రాజ్యాంగపరమైన పరిమితులు వనరులరీత్యా పరిమితులు అనేకం వున్నప్పటికీ వివిధ సంక్షేమ పథకాల అమలుద్వారా కార్మికుల, కష్టజీవుల జీవన ప్రమాణాలు మెరుగుపడేదానికి కృషి చేశాయి.

16వ లోక్‌సభకు జరిగే ఎన్నికలలో సిపిఎం తదితర వామపక్షాల బలం పెరిగితేనే కార్మికవర్గ పోరాటాలు బలపడేదానికి అవకాశం వుంటుంది. బడా కార్పొరేట్ కంపెనీలు, బహుళజాతి కంపెనీలు కార్మికుల జీవితాలమీద, వారి పని పరిస్థితులమీద సాగించే దోపిడీని అడ్డుకోవాలన్నా, నిలువరించాలన్నా, సిపిఎం తదితర వామపక్షాలు మరింతగా బలపడాలి. సంక్షోభ భారాలను కార్మికులు, కష్టజీవులు, సామాన్య ప్రజల మీద మోపడానికి కార్పొరేట్ వ్యాపార, వాణిజ్యవర్గాలు చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటిస్తున్న ఐక్య కార్మికోద్యమ వాణిని పార్లమెంటులో బలంగా వినిపించడానికి సిపిఎం, తదితర వామపక్షాల బలం అనివార్యంగా పెరగాల్సి వుంది. అందుకే సిపిఎంకు ఓటివ్వండి.. .వామపక్షాలను

బలపరచండి... ప్రజా వ్యతిరేక నయా ఉదారవాద విధానాలను పార్లమెంటు లోపలా, వెలుపలా ప్రతిఘటించే శక్తులను మరింత బలోపేతం చేయండి.

## సిపిఎం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన కార్మికవర్గ అనుకూల అంశాలు :

- 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సులకు, రాప్టకోస్ బ్రెట్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు అనుగుణంగా కనీస వేతనం 10,000 రూపాయలు వుండాలి. దీన్ని ధరల సూచితో అనుసంధానం చేయాలి.
- కార్మిక చట్టాలను, వలస కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చెయ్యాలి.
- కాంట్రాక్టు, క్యాజువల్ పని విధానాల్ని నిరసించాలి. కాంట్రాక్ట్ లేబర్ (అబాలిషన్ అండ్ రెగ్యులేషన్) చట్టాన్ని తు.చ. తప్పక అమలు చెయ్యాలి. సమాన పనికి సమాన వేతన న్యాయం ప్రకారం కాంట్రాక్టు కార్మికులందరికీ పర్మినెంట్ కార్మికుల జీత భత్యాలను వర్తింపచెయ్యాలి.
- కార్మికశాఖ డిపార్ట్‌మెంట్‌లను, కార్మికచట్టాల అమలు పర్యవేక్షణా ఏజెన్సీలను బలోపేతం చెయ్యాలి. ఈ రెండు శాఖలకు తగినంత మంది సిబ్బందిని, మౌళిక వసతులు సమకూర్చాలి. లేబర్ కోర్టులు, పారిశ్రామిక ట్రిబ్యునల్‌లో జడ్జీల పోస్టులను, సహాయక సిబ్బంది పోస్టులను భర్తీ చెయ్యాలి.
- అసంఘటితరంగ కార్మికుల కోసం రాజ్యాంగబద్ధమైన జాతీయ నిధిని ఏర్పాటు చెయ్యాలి. తగిన బడ్జెట్ కేటాయింపులు చెయ్యాలి. దారిద్ర్యరేఖ నిర్వచనా పరిధితో నిమిత్తం లేకుండా అసంఘటితరంగ కార్మికులందరికీ ప్రమాద– జీవిత బీమా సౌకర్యాలు రెండూ, ప్రసూతి సదుపాయాలు, శిశు సంరక్షణ, వృద్ధాప్య పెన్షన్ సదుపాయాలు కల్పించాలి.
- పి.ఎఫ్.ఆర్.డి.ఎ. చట్టాన్ని, నూతన పెన్షన్ స్కీమ్‌లను రద్దు చెయ్యాలి. 'డిఫైన్డ్ (నిర్ధారిత) పెన్షన్' స్కీమ్‌ను అందరికీ వర్తింపజెయ్యాలి. యాజమాన్యాలు, ప్రభుత్వం ఎప్పటికప్పుడు తమ వాటా పెన్షన్ నిధికి జమ చేయాలి. పెన్షన్‌ను ధరల సూచితో అనుసంధానించాలి. రిటైర్మెంట్ నాటి వేతనంలో సగభాగానికి సమాన మొత్తంలో పెన్షన్ అందేలా చూడాలి.
- వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖలతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. గ్రామీణ తపాలా సేవలకులను పర్మినెంట్ చేయాలి.

- రహస్య బ్యాలెట్ ద్వారా కార్మిక సంఘాలకు గుర్తింపునివ్వాలి. కార్మిక హక్కులను కాపాడాలి. అన్ని సంస్థలూ పరిశ్రమలూ, కార్మిక సంఘాలను అనివార్యంగా గుర్తించేలా చట్టం తీసుకురవాలి. కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు ఉమ్మడి బేరసారాల హక్కులను కల్పించే ఐ.ఎల్.ఒ. తీర్మానాలు నెంబర్ 87, 98లను ప్రభుత్వం ఆమోదించాలి.
- వివిధ ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న వారిని – అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, ఆశాలు, మధ్యాహ్న భోజన పథకం వారు, పారా టీచర్లు తదితరులందరినీ – 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ తీర్మానం మేరకు కార్మికులుగా గుర్తించి వారికి చట్టబద్ధమైన హక్కులు, సదుపాయాలు అన్నీ వర్తింపచెయ్యాలి. కనీస వేతనాలు, పెన్షన్ గ్రాట్యుటీ వంటి సామాజిక భద్రతా పథకాలు, కార్మిక హక్కులను కల్పించాలి.
- మహిళా కార్మికులకు సమానపనికి సమాన వేతన న్యాయం అమలు చేయాలి. ప్రసూతి సౌకర్యం, సదుపాయాలు కల్పించాలి. పిల్లల పెంపకం కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- లైంగిక వేధింపులు అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టాలి. పని ప్రదేశంలో 'మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, నిషిద్ధం, పరిష్కార' చట్టాన్ని అమలు చెయ్యాలి.
- జాలర్లకు, మత్స్య కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలి. విదేశీ ట్రాలర్లను చేపల వేటకు అనుమతించరాదు. చేపల వేటదార్లకు కార్మికులు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. సామాజిక సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలి.


**వెల :₹ 2/-**

ప్రచురణ కర్త :

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తరఫున**

**జె. జయరాం, హౌస్ నెం. 1-1-60/2, యం.బి.భవన్,**

**ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ముషీరాబాదు, హైదరాబాద్ -20**